# ఉత్తరకుమారులు - అగ్గిదొర

కొంతమంది రాజకీయ నాయకుల రోతకియ్యాలు చూస్తుంటే రకరకాలుగా మనసు స్పందిస్తుంది. వాళ్ళ వెకిలితనం చూసి వెగటు పుడుతుంది. వాళ్ళ అజ్ఞానాన్ని చూసి నవ్వు వస్తుంది. వాళ్ళ తెలివితక్కువతనం చూసి జాలి వేస్తుంది. వాళ్ళ అవినీతి తెలివితేటల పరాకాష్ఠ చూసి కంపరం పుడుతుంది. దేశం వెనక్కి వెడుతుంటే దేశ భవిష్యత్తు ఏమయిపోతుందా అని బాధవేస్తుంది. మిగతా అభివృద్ధి చెందుతున్న దేశాలలో పోల్చి చూసుకుంటే గుండె తరుక్కుపోతుంది.

* * *

ఓ పాత తెలుగు సినిమాలో రేలంగి ఎవడో ఒక బలవంతుడితో అంటుంటాడు "నేనసలే మంచివాడ్ని కాదు. జా లకటకా! ఎందుకులే అని పూరుకుంటుంటే నువ్వు పోట్లాటకి వస్తున్నావ్!" అని అక్కడ ఒక గీత గీస్తాడు. "ఈ గీతకి అవతల నీ ఇష్టమొచ్చినట్టు చేసుకో. కానీ ఈ గీత దాటితే మాత్రం పూరుకోను . తెలుసా?" అని బెదిరిస్తాడు.

అప్పుడా విలనాసురుడు ముక్కామలలా చేత్తో గడ్డం దువ్వుకుని, హా హా హా.. అని నవ్వి ఆ గీత దాటి ముందుకి వస్తాడు. వచ్చి రేలంగి వేపు చూసి "చేయరా ఏం చేస్తావో చెయ్యి ఇప్పుడు?" అంటాడు. అని మళ్ళీ హా.. హా.. హా..అని విలనాట్ట హాసం చేస్తాడు.

అప్పుడు రేలంగి అక్కడ మళ్ళీ ఇంకో గీత గీస్తాడు. గీసి "సరే! ఆ గీత దాటావు ఎందుకులే అని వదిలేస్తున్నాను ఇప్పుడు ఇంకో గీత గీశాను చూశావా దమ్ములుంటే ఇది దాటు. ముక్కలిరగదంతాను" అంటాడు ప్రగల్భాలు పలుకుతూ. అంటూనే వెనక్కితిరిగి "ఎవడ్రా వీడూ! నేనంటే భయం లేదు" అంటాడు గర్వంగా.

ఈలోగా ముక్కామలాసురుడు మళ్ళీ ఆ గీత దాటుతాడు కయ్యానికి కాలు దువ్వుతూ, అచ్చోసిన ఆంబోతులా కాలు రువ్వుతూ "మళ్ళీ గీత దాటాను ఏం చేస్తావో చేసుకో" అంటాడు ఇంకొక హాహాకారం చేసి.

రేలంగి ఒక్క క్షణం ఖంగు తిని, అంతలోనే సర్దుకుని తనూ నవ్వుతాడు.

"మిమ్మల్ని చూస్తే జాలి వేస్తున్నది ముక్కామలగారూ. ఎందుకు అనవసరంగా నాలాటి వాడితో పోటీ పడతారు? మత్తాప్పైపోతారని ఊరుకుంటున్నాను కానీ నేను తల్చుకుంటే మీరొక లెఖ్ఖా? అయినా ఇంకొక్కసారి మిమ్మల్నిప్రాణాలతో వదిలేస్తాను"అని ఇంకొక గీత గీస్తాడు. "ఈసారి గీత దాటారో మీ అంతు చూస్తాను.." ఇలా సాగుతుందీ ఉత్తర కుమార ప్రగల్భాల సీను.

మా శీను అంటాడు కదా "ఈ సినిమా సీను బాగుంది కానీ మామయ్యా ఆదే సీను నిజ జీవితంలో అంత సరదాగా వుండదు. దాంట్లో ఏ మాత్రం హాస్యం వుండదు కదా, ఈ ఉత్తర కుమారులని చూసి మనసు వికలమయి పోతుంది. ఒళ్ళు మండిపోతుంది. ముఖ్యంగా ఈ కాశ్మీరు సమస్య ఇన్ని దశాబ్దాలుగా అసలు పరిష్కారం కాకపోగా, ఈ యాభై అయిదేళ్ళలోనూ ఒక పెద్ద బ్రహ్మరాక్షసిలా పెరిగిపోయి, అరవై వేల మంది హిందువుల్ని బలి తీసుకుంది. ఇంకా ఎన్ని గీతలు గీస్తారో మన ఉత్తుత్తి ఉత్తర కుమారులు"

*   *   *

నేను వైజాగ్‌లో చదువుకునేటప్పుడు మా ఆంధ్రా యూనివర్సిటీ కుర్రాళ్ళం, "కదలడు-వదలడు", "చిక్కడు-దొరకడు", "తోటలో పిల్ల-కోటలో రాణి", "అగ్గిదొర" లాటి సినిమాలకి వెళ్ళేవాళ్ళం. మాయలూ మంత్రాలూ, హీరో రామచిలకగానో ఎలుగుబంటిగానో మారిపోవటంలాటి గమ్మత్తులూ జ్యోతిలక్ష్మి రాజశ్రీ వాణిశ్రీ భారతిల డాన్స్‌ల మత్తులూ వుండే సినిమాలవి

వాటన్నిటిలోనూ కథ దాదాపు ఒకటిగానే వుంటుంది. మిక్కిలి మంచివాడు మిక్కిలినేనికీ, మరీ చెడ్డవాడు రాజనాలకీ అసలు పడనే పడదు. రాజనాల సూర్యోదయం నించీ, అస్తమయం దాకా మిక్కిలినేనిని కవ్విస్తుంటాడు.

ఇక వూరుకోలేక మిక్కిలినేని రాజనాల మిద యుద్ధం ప్రకటిస్తాడు. తన సైన్యంతో వెళ్ళి, ఐదు రోజులు మారణరణం చేస్తాడు. మిత్రదేశానికి చెందిన పాకిస్థానీ ఎంపైర్లు అన్యాయంగా రాజనాల టీమ్‌వాళ్ళకి ఎల్‌బీడబ్ల్యూలు ఇచ్చినా కూడా, మిక్కిలినేని ఆ టెస్ట్‌మేచ్‌లో గెలవలేకపోతాడు. చివరికి ఎలాగోలా తంటాలు పడి ఆ ఐదురోజుల్లోనూ మిగిలిన రోజులన్నీ టిటుకూ టిటుకూమని డిఫెన్స్ ఆడేసి ఆ మేచ్‌ని డ్రా చేయిస్తాడు. డ్రా అవగానే స్టంపులు తగలేసిన బూడిదతో పాటూ అవమానాన్ని కూడా సర్దేసుకుని తన రాజ్యానికి తిరిగి వచ్చేస్తాడు మిక్కిలినేని. రాజనాల

తను గెలిచానని అందరితో గొప్పగా గొప్పలు చెప్పుకుంటాడు.

ఈలోగా మిక్కిలినేని కొడుకు కాంతారావు, బట్టలు సరిగ్గా కట్టుకోవటం రాని, రాజశ్రీ వాణిశ్రీ భారతి జ్యోతిలక్ష్మిలాటి వాళ్ళతో తోటలో డాన్సులు చేయించుకుని, మిక్కిలినేని చేత పట్టాభిషేకం చేయించుకుంటాడు.

ఈలోగా మిక్కిలినేని మంచం ఎక్కుతాడు. రోజూ ఎక్కి దిగే మంచం కాదు మళ్ళీ దిగకుండా పైకి ఎగిరిపోటానికి ఎక్కుతారే... ఆ మంచం అన్నమాట.

ఎక్కి, "నాయనా అగ్గిదొరా! నా కోటలో రాజా! ఆ నాడు రాజనాల నన్ను అవమానించాడు. నేను గెలుద్దామనుకున్న యుద్ధంలో నన్ను గెలవనీయలేదు. నా పరపతిని తిరపతికి పంపించాడు. ఆనాటినించీ నాకున్న కొద్ది జుట్టూ తెల్లబడినా, అతని జుట్టు తెల్లబడలేదు పైగా విర్రవీగుతున్నాడు. ఇలాటి విర్రవీగే విలనులు మిగల కూడదు. కనుక అతనితో మళ్ళీ యుద్ధం చేసి ఈసారి మేచ్ డ్రా కాకుండా గెలిచి విజయుడవై తిరిగి రా! నా కొడుకువనిపించుకో! రక్తతిలకం పెడదామనుకున్నాను కానీ, ఈ వయసులో నాలో రక్తం ఎక్కువ లేదు. ఇదే రక్త తిలకంఅనుకో!" అని మంచం పక్కనే వున్న కుంకుమ భరిణ తీసుకుని ఎర్రటి కుంకం కాంతారావు నుదుటి మీద దిద్దాడు.

"అయ్యా! కాంతారావుగారూ! ఇప్పుడు మన దేశ ఆర్థిక పరిస్థితి ఏమీ బాగా లేదు. ఈపరిస్థితిలో యుద్ధం చేయటం అంతమంచిది కాదేమోనని నాకనిపిస్తున్నది" అని సణుగుతూ సలహా ఇచ్చాడు ముఖ్యమంత్రి చిత్తూరు వి. నాగయ్య.

"నాగయ్యగారూ! నాకు మన దేశ ఆర్థిక పరిస్థితికన్నా, మా నాన్నగారి చివరి కోరిక తీర్చటమే ముఖ్యం. మీకు నేను చేసే యుద్ధం నచ్చకపోతే, అదిగో రిమోట్ కంట్రోల్. దాన్లో ఆఫ్ అనే బటనొకటి వుంటుంది. అది నొక్కేసి ఇంటికి వెళ్ళి తొంగోండి" అని కాంతారావు గుర్రం ఎక్కి, రాజనాల మీద పగ తీర్చుకుని వాళ్ళ నాన్న కోరిక తీర్చే కార్యార్థమై బయల్దేరాడు.

మా శీను అంటాడు కదా "ఈ సినిమా సీను బాగుంది కానీ మామయ్యా అదే సీను నిజ జీవితంలో జరిగితే అంత సరదాగా వుండదు. ఈ రోజుల్లో కూడా తండ్రి కోరిక తీర్చటం కోసం, కొడుకు యుద్ధానికి వెళ్ళటమేమిటీ? ఈ ఇరాక్-అమెరికాల సమస్య ఇలాటి అగ్గిదొర సినిమా కథలతో తీరుతుందనుకోను!" అని.

* * *